క్లుప్తంగా

ఆలయాల పునఃనిర్మాణ పనులు షురూ

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో ఈనెల 28 అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గ్రామ పరిధిలోని పోచమ్మ, పెద్దమ్మతల్లి దేవాలయాలను కూలగొట్టారు. భూ కబ్జాదారులే ఇలా దేవాలయాలను కూల్చారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.పూర్తిస్థాయి విచారణ జరిపి ఇలాంటి చర్యలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అయితే వీరంతా కలిసి మంగళవారం నుంచి ఆయా దేవాలయాల పునఃనిర్మాణ పనులను చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సర్పంచ్ శ్రీనివాస్



అవగాహన ర్యాలీలో సర్పంచ్ శ్రీనివాస్, సిబ్బంది

కందుకూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బాచుపల్లి సర్పంచ్ యాలాల శ్రీనివాస్ కోరారు. జూన్ 5న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని బాచుపల్లిలో పర్యావరణహిత జీవన శైలిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణం కలుషితం కాకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌తో పాటు గాలి కలుషితమయ్యే రసాయనాలు వాడవద్దని, చెట్లను విరివిగా నాటి భవిష్యత్ తరాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమాచారి, అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు నరేష్, కారోబార్ సుధాకర్, స్థానికులు కేతమ్మ, మరియాదా, అనసూయ, కొంరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీవిశ్వనాథ్ బదిలీ అయ్యారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆయన 2021 డిసెంబర్‌లో పహాడీషరీఫ్ డీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది మార్చి 17న ఇక్కడి ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ బదిలీ కావడంతో... ఆయన స్థానంలో 18 నుంచి ఎస్‌హెచ్‌ఓగా కొనసాగుతున్నారు. తాజాగా ఆయనను మంచాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఇన్‌స్పెక్టర్ వచ్చాక ఆయన రిలీవ్ కానున్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యానారాయణ వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

బీజేవైఎం కార్యదర్శిగా కొండల్‌రెడ్డి



బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన రామిడి కొండల్‌రెడ్డిని బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేవైఎం కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేపీఅధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి మంగళవారం నియామకపత్రాన్ని కొండల్‌రెడ్డికి అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కొండల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

మున్సిపల్ చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలు జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా 22 రోజుల పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, కౌన్సిలర్లు శివకుమార్, రవినాయక్, సుమన్, విలాస్, లావణ్య, తేజస్విని, ఏఈఈ భార్గవ్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





విద్యుత్ లైన్లకు బిగించిన జాయింట్లు (వృత్తంలో)

ఏ నిమిషానికి.. ఏమి జరుగునో

ప్రశాంతిహిల్స్‌లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- వైర్లు తెగినప్పుడల్లా జాయింట్‌లతోనే సరిపెడుతున్న విద్యుత్ సిబ్బంది
- కొత్త తీగలు వేయాలంటున్న స్థానికులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తీగలు తెగిపడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్ రోడ్ నం.8లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్ కావడం...ఆ తర్వాత మార్చకపోవడంతో పలుమార్లు తీగలు తెగిపడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. తీగలు తెగిపిన ప్పుడల్లా విద్యుత్ శాఖ అధికారులు రావడం తాత్కాలికంగా జాయింట్లు బిగిస్తున్నారు తప్ప వైర్లు మార్చడం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఒక్కో వైరుకు మూడు నుంచి నాలుగు జాయింట్లు ఉన్నాయని.. ఎప్పుడు ఏ వైర్ తెగి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వైర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

బస్తీ దవాఖాన నిర్మాణ పనులు ఆపాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



రాజీవ్‌గృహకల్ప కాలనీలోని వినాయక మండపం స్థలంలో నిర్మిస్తున్న బస్తీ దవాఖాన

బడంగ్‌పేట్: వినాయక మండపం స్థానంలో బస్తీ దవాఖానను నిర్మిస్తున్నారని అట్టి నిర్మాణ పనులను వెంటనే ఆపివేయించాలని కోరుతూ మంగళవారం రాజీవ్‌గృహకల్ప కాలనీవాసులు బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా 25వ వార్డు రాజీవ్ గృహకల్ప సెప్టిక్ ట్యాంక్ పక్కన 5వ బ్లాక్ ఎదురుగా యువ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామని అన్నారు. నేడు అదే స్థలంలో వినాయక షెడ్డులోనే బస్తీ దవాఖాన పేరుతో నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. వినాయక మండపం పక్కనే ఖాళీ స్థలంలో పిల్లర్లతో బస్తీ దవాఖాన నిర్మాణం చేస్తే బాగుంటుందని వారు కోరారు. అది కాదని వినాయక షెడ్డును ఆక్రమించి బస్తీ దవాఖాన నిర్మాణం చేయడమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని కమిషనర్‌ను కోరారు. కాలనీవాసులు.. నారాయణయాదవ్, శశివర్ధన్, విష్ణు, కిట్టు, శ్రీకాంత్, సునీల్, రామశివ, నాగరాజ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

భూ హక్కులు కల్పించండి

- మంత్రి సబితారెడ్డికి రైతుల వినతి

బడంగ్‌పేట్: భూమి హక్కులు కల్పించాలని కోరుతూ.. మంగళవారం కుర్మల్‌గూడకు చెందిన రైతులు బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలోని బొద్రమోని కుటుంబాలు సర్వేనంబర్ 80/3లో 4 ఎకరాల 23 గుంటల భూమిలో గత 75 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుని బొద్రమోని కుటుంబాలకు చెందిన వారము జీవిస్తున్నామన్నారు. అట్టి భూమికి సంబంధించిన రెవెన్యూ పన్నులు కూడా ప్రభుత్వానికి చెల్లించాము. పహాణీ రికార్డుల్లో కూడా కబ్జా కాలంలో మా పేర్లు ఏళ్ల తరబడి వస్తు ఉన్నాయి. ఆ భూమి తప్ప వేరే ఎలాంటి ఆస్తులు లేవు. కడు బీదరికంలో ఉన్న మాకుటుంబాలను ఆదుకుని భూమి హక్కులు కల్పించాలని కోరారు. విన్నవించిన వారిలో నర్సింహ, కుమార్, శ్రీధర్, రాజు, శివ తదితరులున్నారు.



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కుర్మల్‌గూడ రైతులు

వేగానికి కళ్లెం వేయరూ..

- జల్‌పల్లి- మామిడిపల్లి చౌరస్తాలో తరచూ ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి



జల్‌పల్లి- మామిడిపల్లి చౌరస్తా

పహాడీషరీఫ్: జల్‌పల్లి నుంచి మామిడిపల్లి వెళ్లే దారిలోని 777 హోటల్ కూడలి వద్ద ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కూడలి మధ్యలో గతంలో చిన్న చిన్న గోతులు ఉండటంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లేవారు. ఇటీవల ఇక్కడ నూతనంగా బీటీ వేయడంతో వాహనదారులు అతివేగంగా వెళ్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. మామిడిపల్లి నుంచి వచ్చే వాహనదారులు పహాడీషరీఫ్ వైపునకు మలుపు తీసుకుంటున్న సమయంలో.. జల్‌పల్లి నుంచి మామిడిపల్లి వైపు వెళ్లే వాహనదారులు కూడా మలుపు తీసుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. లక్ష్మీగూడ, వాంబే కాలనీ, డేసీ దాబాల వద్ద మాదిరిగా ఈ కూడలి వద్ద కూడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. దీంతో పాటు ఈ కూడలిలో ఏ రోడ్డు ఎటు వెళ్తుందో తెలుపుతూ సూచికబోర్డులు ఏర్పాటు చేయాలంటున్నారు.

ప్రాచీన కళలను బతికించుకుందాం



కళాకారులతో ప్రశాంత్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: కనుమరుగవుతున్న ప్రాచీన కళలను బతికించుకుందామని ప్రముఖ సంఘసంస్కర్త నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో సోమవారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి చరిత్ర స్టేజి నాటాక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో స్టేజి నాటకాలను నిర్వహించడం అభినందనీమన్నారు. అనంతరం కళాకారులకు వ్యక్తిగతంగా రూ.21,000 అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్, నాటక బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహిద్దాం..

అంతరించిపోతున్న కళలను ప్రోత్సాహించాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి స్టేజి నాటకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాఘవేందర్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులచే రూ.10,000 కళాకారులకు అందజేశారు. కార్యక్రమంలో మహేష్, భరత్‌రెడ్డి, కిషన్, రాఘవేందర్, హైమద్, రత్నయ్య, శ్రీను, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి

- జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయలతో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో జల్‌పల్లి మున్సిపాలిటీ రూపురేఖలు మారుతున్నాయని చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. 9వ వార్డులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... షా హిల్స్ కాలనీ నుంచి వాదే-ఉమర్ కాలనీ వరకు 520 మీటర్ల మేర నిర్మిస్తున్న ఈ రహదారి అందుబాటులోకి వస్తే స్థానికులకు ఎంతో వెసులుబాటుగా మారనుందన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగతున్నాయన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. గడిచిన మూడేళ్లలో జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, షాహిన్‌నగర్, కొత్తపేట, ఎర్రకుంట పరిసరాల్లో పెద్దఎత్తున సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు విస్తరణపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ పార్టీ నాయకులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్ గౌడ్

మహేశ్వరం: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి అధ్యక్షతన మంగళవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె ప్రగతి కింద నిధులు వస్తున్నాయన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. మహేశ్వరంలో కమలం వికసించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్ శర్మ, కదారి జంగయ్య, అనంతయ్యగౌడ్, దేశ్యానాయక్, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు యాదిష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు నందీశ్వర్, బుగ్గని శంకర్, నాయకులు ముత్యం, భూపాల్‌రెడ్డి, ఆదిలక్ష్మీ, శ్రవణ్, శ్రీనివాస్, అనిత పలువురు పాల్గొన్నారు.

తెలంగాణలో సంక్షేమాల స్వర్ణయుగం

- మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణలో సంక్షేమాల స్వర్ణయుగం నడుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని పురాతన ఖిల్లామైసమ్మ ఆలయాభివృద్ధికి కోటి రూపాయులు కేటాయించిన సందర్భంగా మంగళవారం ఆమె ఆలయాన్ని పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, నాయకులతో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్నారని, తాము హిందువులమని గొంతు చించుకొని అరిచేవాళ్లు ఆలయాల అభివృద్ధికి ఒక రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పునర్నిర్మాణం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పురాతన ఆలయాల అభివృద్ధికి అడిగిన వెంటనే రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్, మురుకుంట్ల అరవిందకుమార్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, పటేల్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లా మైసమ్మ ఆలయాన్ని సందర్శించిన మంత్రి సబితారెడ్డి తదితరులు

బీజేపీ ఆమనగల్లు అధ్యక్షుడిగా శ్రీకాంత్‌సింగ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన శ్రీకాంత్‌సింగ్‌ను నియమించా రు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత ఆచారి.. శ్రీకాంత్‌సింగ్‌కు నియామక పత్రం అందించారు. అనంతరం శ్రీకాంత్‌సింగ్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో శ్రీకాంత్‌సింగ్ ఆమనగల్లు ఏబీవీపీ కన్వీనర్‌గా, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్‌గా, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ఈ కార్య క్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, కల్వకుర్తి బీజేపీ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మహిళలు, ప్రయాణికులు, చిన్నారులు, వృద్ధుల దాహం తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, స్వామి, నందు, యాదగిరి, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు విరాళం

మంచాల: మంచాల మండల పరిధిలోని సత్యం తండాలో బొడ్రాయి పండుగను జూన్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఎంపీ కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశానుసారం మంగళవారం మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి ఉత్సవ నిర్వహణ కమిటీకి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. తండాలో బొడ్రాయి పండుగ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుందామన్నారు. సత్యం తండా సర్పంచ్ పెంట్యానాయక్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న నిర్వహించే వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, రైతుబంధు కోఆర్డినేటర్లతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని రైతువేదికలను ముస్తాబు చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా రైతులతో సహపంక్తి భోజనాలు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలపై వివరించాలన్నారు. కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డివిజన్ వ్యవసాయాధికారి సత్యనారాయణ, అధికారులు, రైతుబంధు మండల కోఆర్డినేటర్లు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

అవగాహన సమావేశం..

మంచాల: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంచాల ఎంపీపీ నర్మద అన్నారు. మంగళవారం మంచాలలో అవతరణ వేడుకలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, సూపరింటెండెంట్ జంగయ్యగౌడ్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఎంపీపీ కృపేష్ అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాలపై ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, రైతుబంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సీడీపీఓ శాంతిశ్రీ పాల్గొన్నారు.

అధికారులతో ఎంపీడీఓ సమీక్ష..

తలకొండపల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2 నుంచి నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ మండల శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ రాజు, ఏఈ కటారియా, ఏపీఓ కృష్ణ, ఏపీయం శ్రీదేవి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.